ప్రజాశక్తి
శనివారం 14 సెప్టెంబర్ 2024 5
శ్రీ సత్యసాయి



కూలిన నాగేపల్లి వంతెన

ప్రజాశక్తి-కణేకల్లు

మండల పరిధిలోని నాగేపల్లి గ్రామ శివారులో హెచ్చెల్సీ కాలువపై ఉన్న వంతెన శుక్రవారం కూలిపోయింది. వంతెనపై లారీ వెళ్లిన వెంటనే ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే లారీ పూర్తిగా అవతల వైపు వెళ్లడంతో ప్రమాదం తప్పినట్లయింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వంతెన కూలిపోవడంతో నాగేపల్లితో పాటు తుమ్మిగనూరు గరుడచేడు, బిదురుకుంతం, వన్నూరు నుంచి బళ్లారి వెళ్లే ప్రయాణికులకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు, టిడిపి నాయకులు కూలిన వంతెనను పరిశీలించారు.



కూలిన నాగేపల్లి వంతెన

నేటి నుంచి సైన్సు పండుగ

అట్టహాసంగా జెవివి వార్షిక రాష్ట్ర మహాసభ
'అనంత' నగరంలో రెండు రోజులపాటు నిర్వహణ



జెవివి రాష్ట్ర మహాసభ నిర్వహించే సభాస్థలి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేసే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వార్షిక 17వ మహాసభ శనివారం నుంచి అనంతపురం నగరంలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 14, 15 తేదీల్లో నగరంలోని జిఆర్ ఫంక్షన్ హాలులో జరుగనున్నాయి. భాగ్యవతి హాల్‌లో జరిగే ఈ రెండు రోజుల మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు సుమారు 400 మంది హాజరుకానున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను జన విజ్ఞాన వేదిక మహాసభ నిర్వాహక కమిటీ పూర్తి చేసింది. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ ఈ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఈ రెండు రోజుల మహాసభలో ప్రజల్లోకి శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకెళ్లడం ఎలాగన్న అంశాలపై చర్చించడంతోపాటు, జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలను సమీక్షించుకోవడం, లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది.



మహాసభ ప్రాంగణ ముఖద్వారం

రెండు రోజులపాటు వివిధ అంశాలపై సదస్సులు

జన విజ్ఞాన వేదిక వార్షిక మహాసభ సందర్భంగా వివిధ అంశాలపై సదస్సులు జరుగనున్నాయి. మహాసభ ప్రారంభం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టరు డాక్టర్ వి.వినోద్‌కుమార్ హాజరు కానున్నారు. ఎస్కేయు వైస్ ఛాన్సలరు బి.అనిత విశిష్ట అతిథిగా హాజరవుతారు. సందర్భంగా 'సైంటిఫిక్ టెంపర్–ఛాలెంజెస్' అన్న అంశంపై ఆల్ ఇండియా పీపుల్స్ సైన్సు నెట్‌వర్కు మాజీ అధ్యక్షులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ సైంటిస్టు సవ్యసాచి చటర్జీ పాల్గొని ప్రారంభోపన్యాసం చేయనున్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం. జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాచపాలెం చంద్రశేకర్‌రెడ్డి ఆత్మీయ సందేశం ఇవ్వనున్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నక్కా వెంకటేశ్వర్లు సౌహార్ద సందేశం ఇస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన భారత రాజ్యాంగం అమలు తీరు తెన్నులపై సదస్సు జరుగుతుంది. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం వక్తగా ఉంటారు. 15వ తేదీన 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి–కొన్ని పరిశీలనలు' అన్న అంశంపై జరిగే సదస్సుకు జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు వక్తగా ఉంటారు.

శాస్త్రీయత ఉట్టిపడేలా ఫ్లెక్సీలు ఏర్పాటు

ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక 17వ వార్షిక మహాసభలోనూ శాస్త్రీయత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తోంది. వేదికపైన ఏర్పాటు చేసిన బ్యానర్లలోనే శాస్త్రీయ గుర్తులు కనిపించే విధంగా ఏర్పాటు చేయడం ఆలోచింపజేసే విధంగానున్నాయి. అదే విధంగా ఆవరణంలోనూ మహిళలపై హింస, అసమానతలు తదితర అంశాలపై ఫ్లెక్సీలు , ముఖ్య అతిథిగా ఏర్పాటు చేశారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



పుట్టపర్తి సిపిఎం కార్యాలయం వద్ద ఫ్లాగ్‌డౌన్ చేసిన నాయకులు

సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి అనంతపురం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిపిఎం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. అనంతపురంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాప సభలు నిర్వహించి నివాళి అర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతారం ఏచూరి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. అందే విధంగా జిల్లాకేంద్రంలో టివి టవర్ వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో సీతారం ఏచూరి సంతాప సభలు జరిగాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో కూడా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభలను సిపిఎం, అనుబంధ సంఘాల నాయకులు నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మరిన్ని వార్తలు 6వ పేజీలో...



సీతారాం ఏచూరి చిత్రపటానికి గుంతకల్లు నాయకుల నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కదిరి నాయకులు



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించే వరకూ సమ్మె

శ్రీ సత్యసాయి బోర్డు కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన
కార్మిక సంఘాలు, కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు చెల్లించిన తర్వాతే విధుల్లోకి చేరుతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు అన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని శ్రీ సత్యసాయి శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన నిరవేదిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులుచ కార్మికులతో సత్యసాయి బోర్డ్ కార్యాలయంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు శుక్రవారం చర్చలు నిర్వహించారు. అయితే వేతనాలు చెల్లింపు తప్ప ఏ ఇతర సూచన చేసినా సమ్మె విరమించేది లేదని కార్మికులు తెలిపారు. వేతనాలు చెల్లింపునకు సమయం పడుతుందని అధికారులు చెప్పడంతో చర్చలు విఫలం చెందాయంటూ కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ 8 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నామమాత్రపు చర్చలతో కాలయాపన చేయడం అన్యాయంగా ఉందన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని, శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమును కాపాడాలని, ప్రజలకు, కార్మికులకు నష్టం కలిగించే క్యూ.సి, క్యూ.ఎ. కమిటి ప్రతిపాదనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 5 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా సత్యసాయి బోర్డ్ ఆఫీసులో యూనియన్ నాయకులు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, డిఈ, జేఈలతో జరిపిన చర్చలు విఫలం అయ్యాయని అన్నారు. ప్రభుత్వం నిర్దిష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సమ్మె యధావిధిగా కొనసాగించాలని నిర్ణయించుకున్నామన్నారు. గత సంవత్సరం చేసిన సమ్మె సందర్భంగా చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం హామీలు కూడా అమలు నేటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల మొండి వైఖరి కారణంగా సమ్మె యదావిధిగా కొనసాగుతుందని, ప్రజలు ప్రజాప్రతినిధులు మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి వాట్ వర్కర్స్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరయ్య, శ్రీనివాసులు, తిప్పేస్వామి, మధు, శ్రీరాములు, ప్రసాద్, వన్నూరప్ప, లక్ష్మీ రెడ్డి, వీరాంజనేయులు. బాలకృష్ణ, బాబయ్య, రమేష్ రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



చర్చల సందర్భంగా అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీనీవా నీరివ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

మడకశిర బ్రాంచ్ కెనాల్ పరిధిలోని అన్ని చెరువుల్లోనూ పూడిక తీయించి హంద్రీనీవా జలాలు అందించాలని జలసాధన సమితి నాయకులు కోరారు. జలసాధన సమితి నాయకులు అనంతపురంలో హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్ఇ దేశ నాయక్‌ను శుక్రవారం కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా జలసాధన సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, హంద్రీనీవా కాలువ పూడిక తీసి, మరమ్మత్తులు పూర్తిచేసి మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 265 చెరువులను నీటితో నింపాలన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు బాలకృష్ణ, ఎంఎస్ రాజు, మంత్రి సవిత ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమంలో జల సాధన సమితి ప్రతినిధులు అడ్వకేట్ రామ్ కుమార్, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాసులు, ఏసు, వీర నారప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా దులీప్ ట్రోఫీ

తొలి ఇన్నింగ్‌లో కుప్పకూలిన ఇండియా - డి
ఇండియా -ఎ బౌలర్ల ధాటికి 183కే ఆలౌట్
ఇండియా -సి 525కి ఆలౌట్
దీటుగా ఆడుతున్న ఇండియా - బి



ప్రజాశక్తి - అనంతపురం,

ఇండియా ఏ బౌలర్ల ధాటికి ఇండియా డి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 183 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఇండియా ఏ జట్టుకు 107 తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇండియాఏ జట్టు బ్యాట్స్‌మెన్లు ప్రతమ్ సింగ్, మయాంక్ అగర్వాల్ అర్ధ సెంచరీలు చేశారు. మరో మ్యాచ్‌లో ఇండియా సి జట్టు భారీ స్కోర్ చేసింది. ఇండియా బి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ధీటుగా జవాబిచ్చింది. శుక్రవారం అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో ఉన్న రెండు మైదానాల్లో రెండో రౌండ్ దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భాగంగా ఇండియా ఎ, ఇండియా డి ఒక గ్రౌండ్‌లో , ఇండియా బి, ఇండియా సి జట్లు మరో గ్రౌండ్‌లో తలపడ్డాయి.

రాణించిన అఖీబ్, ఖలీల్


ఇండియా ఏ జట్టు బౌలర్లు ఖలీల్ అహ్మద్, అఖీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు తీసుకుని ఇండియా డి జట్టును స్వల్పస్కోర్‌కు పరిమితం చేశారు. మిగతా బౌలర్లు ప్రసిద్ధ్ కృష్ణ, తనుష్, సామ్స్ చెరో వికెట్ తీసుకున్నారు. ఇండియా డి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 52.1 ఓవర్లలో 183 పరుగులు చేసింది. జట్టులో దేవదత్ పడిక్కిల్ 92(15 ఫోర్లు), హర్షిత్ రాణా 31, రికీ బుయి 23 పరుగులు చేయగా, మిగితా వారు పెద్దగా రాణించలేదు. దీంతో ఇండియా ఏ జట్టుకు 107 పరుగుల ఆధిక్యత లభించింది.

మయాంక్, ప్రతమ్ సింగ్ అర్ధసెంచరీలు

అనంతరం ఇండియా ఏ జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి ఆటముగిసే సమయానికి వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్లు ప్రతమ్ సింగ్ 82 బంతుల్లో 6 బౌండరీలతో 59, కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 87 బంతుల్లో 8 ఫోర్ల సహాయంతో 56 పరుగులు చేశారు.

ఇండియా- సీ భారీ స్కోర్

ఇండియా బీతో జరుగుతున్న మరో మ్యాచ్‌లో ఇండియా సీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టులో ఆల్‌రౌండర్ మవన్ సుతార్ 156 బంతుల్లో 11 బౌండరీలు 3 సిక్సర్ల సహాయంతో 82 పరుగులు చేయడం విశేషం. అన్షుల్ కాంబోజ్ 38, మయాంక్ మార్కండే 17 పరుగులు చేశారు. ఇండియా బీ జట్టు బౌలర్లలో ముకేష్ కుమార్ 4, రాహుల్ చాహర్ 4, నవదీప్‌శైనీ, నితీష్‌కుమార్ రెడ్డి చెరో వికెట్ తీసుకున్నారు. ఇండియా బి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ధీటుగా జవాబిచ్చింది. జట్టులో కెప్టెన్ అభిమన్యు మిథున్ 91 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 51, నారాయణ్ జగదీశన్ 126 బంతుల్లో 8 ఫోర్లతో 67 పరుగులు చేశారు. ఇండియా బి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసింది.



'పురం'లో కోలాహలంగా శోభాయాత్ర



పట్టణంలో వినాయక శోభాయాత్ర

ప్రజాశక్తి-హిందూపురం

వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రతిమకు శుక్రవారం నిమజ్జన కార్యక్రమాన్ని కోలాహలంగా జరిగింది. పోలీసుల అవగాహన రాహిత్యం వల్ల సాయంత్రం 6 గంటలు అయినా ఆయా ప్రాంతాల నుంచి ప్రతిమలు శోభాయాత్రకు రాలేదు. చివరకు పోలీసులు వినాయక మంటప నిర్వహకులతో చర్చించి ప్రతిమలను తరలించాలని కోరారు. దీంతో నిర్వహకులు అన్ని సిద్ధం చేసుకుని శోభాయాత్రకు వచ్చే సమయానికి రాత్రి అయింది. ఈ సందర్భంగా పురపాలక సంఘం తరపును సౌకర్యాలను కల్పించారు. మునిసిపల్ ఎంఇ విశ్వనాథ్, డిఇఇ బాలసుబ్రమణ్యంతో పాటు ఎఇ నాగేంద్ర, ఇతర మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. కోనేరు వద్ద టిడిపి, వైసిపి నాయకులతో పాటు పలువురు కౌన్సిలర్లు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా వినాయక నిమజ్జన కార్యక్రమంలో మైనార్టీ నాయకులు వివిద మసీదుల ముతవల్లీలు పాల్గొన్నారు. నవీన్ నిశ్చల్ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు పలువురు విరివిగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ

సమస్యాత్మక కేంద్రంగా వున్న హిందూపురంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ, హిందూపురం, పెనుకొండ డీఎస్పీల ఆద్వర్యంలో పట్టణంలో వినాయక నిమజ్జనాన్ని పరిశీలించారు. పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. ఎస్పితో పాటు అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ, కేవీ మహేష్, ఎస్బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, కరీం, జనార్ధన్, పలువురు సిఐలు, ఎస్ఐలు, పెద్ద ఎత్తున పోలీసులతో పాటు రెండు వజ్రవాహనాలతో బందోబస్తు నిర్వహించారు. దీంతో ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

ప్రజాశక్తి - రొద్దం

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆమె శుక్రవారం మండలంలోని రొద్దం–కందుకూరుపల్లి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముందుగా రొద్దంలో ఏర్పాటు చేసిన 21 అడుగుల వినాయకుడి విగ్రహానికి పూజలు చేశారు. వైఎస్ఆర్ సర్కిల్‌లో కలిపి, దొడగట్ట, నారనాగేపల్లి గ్రామ పంచాయతీలలకు ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ట్రాక్టర్ నడిపి ఉత్సాహపరిచారు. మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం మండలానికి మూడు ట్రాక్టర్లు కేటాయించామని, త్వరలో ట్రాలీలు మంజూ రు చేస్తామన్నారు. స్థానిక పిహెచ్‌సి సమస్యలను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

పరిగి : మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని మంత్రి సవిత తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీ పున:నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. అలాగే పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను గుర్తించామని త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. రూ. 4 కోట్లతో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్వాడీ నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సరస్వతి, తహశీల్దార్ హసీనాసుల్తానా, అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరాణి, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు సత్యనారాయణ, మారుతిప్రసాద్, తిలక్, లక్ష్మణరావు, చౌడప్ప, డిహెచ్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు, హనుమయ్య పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

ఉద్యమ నేత సీతారాం ఏచూరికి నివాళి



మడకశిరలో ఏచూరి మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల, తదితరులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కమ్యూనిస్టు ఉద్యమ నేత, సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణ వార్తను కార్మిక సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయని సిపిఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ తెలిపారు. పట్టణం లోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఏచూరి చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సిపిఎం జెండాను అవనతం చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ ఏచూరి మరణం కార్మిక లోకానికి తీరని లోటు అన్నారు. గడ్డు పరిస్థితుల్లో సైతం పార్టీ, ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా, రాజకీయాల్లో పార్లమెంటేరియన్‌గా తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. జిల్లాలో మూడు రోజుల పాటు పార్టీ కార్యకలాపాలను రద్దు చేసి సంతాప దినాలుగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాకే వెంకటేష్, ఫకృద్దీన్, బాబా, ఆఫీస్ బేరర్ సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : సిఐటియు మండల కన్వీనర్ పైపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజా సంఘాల నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మిక, కర్షక, పేద ప్రజల పక్షాన నిరంతర పోరాటం చేసిన యోధుడు సీతారాం ఏచూరి మరణం సిపిఎం, సిఐటియు, కార్మిక, కర్షకులకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుధాకర్, రమేష్, వెంకటేష్, మున్సిపల్ కార్మిక నాయకులు దొడ్డప్ప, బాబయ్య, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : పట్టణంలోని సిపిఎం కార్యాలయం వద్ద పార్టీ జెండాను అవనతం చేసి కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు సుబ్బిరెడ్డి, జిఎల్.నరసింహులు మాట్లాడుతూ ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. తన జీవితం యావత్తు సోషలిజం సాధన, కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి ధార పోశారన్నారు. పీడిత ప్రజల పక్షాన తుది శ్వాస వరకూ నిబద్ధతతో పని చేశానన్నారు. ఏచూరి ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జగన్మోహన్, సాంబశివ, బాబ్‌జాన్, రామ్మోహన్, ముస్తాక్, తాజుద్దీన్, రాజారెడ్డి, తిరుపాల్, యాకూబ్‌ఖాన్, శాంతిబాయ్, మాబున్నీసా, మున్ని, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : సీతారాం ఏచూరి లేని లోటు వామ పక్షాలు, జాతీయ రాజకీయాలకు తీరని లోటు అని సిపిఎం, సిఐటియు నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో మండల కార్యదర్శి బాబావలి అధ్యకతన ఏచూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సిపిఎం నాయకులు హరి, సిఐటియు నాయకులు రమేష్, బావమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్ మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలనికి ఆకర్షితుడై సిపిఎంలో అంచె లంచెలుగా జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. ప్రజా పోరాటాలను ముందుండి నడిపించార న్నారు. అనేక పుస్తకాలు రాసిన మంచి రచయిత, ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో నరసింహ, మహబూబ్‌బాషా, రాజురావు పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు : ఎమ్మెల్యే

మడకశిర : సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి మరణం తీరని లోటు అని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో వారు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారు మాట్లాడుతూ ఏచూరి వామపక్ష సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నో సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు విఎం.పాండురంగప్ప, నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి కన్వీనర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజలకు తీరని లోటు అని సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న తెలిపారు. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏచూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, జెవి.రమణ, సిఐటియు నాయకులు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : స్థానిక ఆటో స్టాండ్ ఆవరణలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ కేశవ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి కార్మికులు, కార్మిక సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వారు ఏచూరి సేవలను కొనియాడారు. ఏచూరి మరణం వామపక్షాలు, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా అన్నారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ మబాషా, బావయ్య, అంగన్వాడీ సిబ్బంది కిష్టమ్మ, సరళమ్మ, కవిత, తులసి, మమత, అరుణమ్మ, కల్పన, సునీత పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక చావిడి వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఫకృద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక సిఐటియు కార్యాలయం లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.రాజగోపాల్, రంగప్ప, చాంద్‌బాషా, లక్ష్మీనారాయణ, మాబు, గంగరాజు, శ్రీకాంత్, మగ్గం రామాంజి, ఈడిగ నాగరాజు, శీలా నారాయణస్వామి, బెస్త కృష్ణప్ప,, కుమ్మర కిష్టప్ప, నాగభూషణం, ఈడిగ రామకృష్ణ, రవి పాల్గొన్నారు.

గాండ్లపెంట : సిపిఎం మండల నాయకులు, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం బాధాకరమని, దేశానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కెకె.రాజారెడ్డి, ఖాదర్‌బాషా, హమాలీ యూనియన్ నాయకులు ఎం.కొండయ్య, ఎర్రదొడ్డి బయన్న, వీరాంజనేయులు, నరసింహులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : కొడికొండ చెక్ పోస్ట్ సమీపంలో సిపిఎం సుందరయ్య కాలనీలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి 1974లో విద్యార్థి దశలో ఉద్యమంలోకి అడుగిడి ఐదు దశాబ్దాల పాటు మొక్కవోని దీక్షతో ఎర్రబాటలో అగ్రభాగాన నిలిచిన యోధుడు అన్నారు. ఏచూరి మరణం సిపిఎం, కార్మిక, పీడిత వర్గాలకు తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రామచంద్ర, వెంకటేష్, మంజునాథ్, నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు క్రిష్ణమూర్తి, ఇళ్ల స్థలాల పోరాట నాయకులు నరసింహ, రహంతుల్లా, యాస్మిన్, మహబూబ్‌జాన్, షమీవుల్లా, ఆదిలక్ష్మమ్మ, నాగమ్మ, అయాజ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : స్థానిక గాంధీనగర్ పాఠశాలలో సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి సిపిఎంకు తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పుట్టపర్తి పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు, కో కన్వీనర్లు శంకర్‌రెడ్డి, శ్రావణి, సిఐటియు నాయకులు నాగమణి, లక్ష్మయ్య, వెంకటేష్, చెన్నకేశవులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, భాస్కర్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అంబేద్కర్ సర్కిల్ వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో వామపక్ష పార్టీలకు బ్రాండ్‌గా నిలిచిన ఏచూరి మరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, నాయకులు బండల వెంకటేష్, బాబు, పోతులయ్య, మధుసూదన్ రెడ్డి, ఆవాజ్ కమిటీ బాబ్జాన్, రఫీ, నౌషాద్, ముస్తఫా, బాషా, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి తిప్పయ్య, నాయకులు కిష్టయ్య, ఆ పార్టీ రైతు సంఘం మండల కార్యదర్శి డాబా కృష్ణ, తుమ్మల చిన్నప్ప, ప్రసాద్‌నాయక్, శంకర, గణేష్ యాదవ్ పాల్గొన్నారు.



హిందూపురంలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

గోరంట్ల రూరల్ : మండలంలోని పాలసముద్రం గ్రామంలో పేదలు నివాసం ఉన్న కాలనీలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కొండా వెంకటేశులు, స్వర్ణలత అధ్యక్షతన పూలమాల వేసి నివాళు లర్పించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య మాట్లాడుతూ ఏచూరి తుది శ్వాస వరకూ సిపిఎం అభివృద్ధి కోసం సేవ చేశారని కొనియాడారు. ఉన్నత వర్గాల్లో పుట్టి పీడిత ప్రజల కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, పల్లి ఆంజనేయులు, కెవిపిఎస్ మండల నాయకులు భాస్కర్, రామాంజనేయులు, గంగాధర్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు నంజుండప్ప, ప్రదీప్, లక్ష్మీ దేవమ్మ, అచ్చమ్మ, రాజేశ్వరి, సుజాతమ్మ, రత్నమ్మ, నూరమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలను సాధిద్దాం

హిందూపురం : కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాలను నెరవేరుద్దామని సిపిఎం జిల్లా నాయకులు జెడ్‌పి.శ్రీనివా సులు అన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన కలలుగన్న సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాము, ఫ్రీకాట్ యూనియన్ నాయకులు సదాశివరెడ్డి, ఆటో యూనియన్ హిందూపురం పట్టణ కార్యదర్శి రామకష్ణ, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, సిఐటియు నాయకులు సోము, జబివుల్లా, మల్లికార్జున, జగదీష్, నాగేంద్ర, రవి పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని సిపిఎం కాలనీలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతు కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలకు అనుగుణంగా అందరు పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షురాలు నశింతాజ్, కమిటీ సభ్యులు నాజియా, సరస్వతి, అర్షియా, ఆదిలక్ష్మమ్మ, రామంజప్ప, రాజప్ప, ఆంజనేయులు, అంజలి తదితరులు పాల్గొన్నారు.



కొత్తచెరువులో నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు



పెనుకొండలో నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాల యంలో శుక్రవారం ఎల్‌టిపిలతో భవన నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లా డుతూ నగర పంచాయతీ పరిధిలో నిర్మాణం చేయాలంటే తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి నగర పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. నగర పంచాయతీలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. వార్డుల్లో సమస్యలుంటే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని కమిషనర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

ఎన్టీఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం

పెనుకొండ టౌన్ : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వీలైనంత త్వరగా మౌలిక వసతులు కల్పిస్తామని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సిపిఎం నాయకులు గురువారం ఇచ్చిన వినతి మేరకు కమిషనర్ శుక్రవారం ఎన్‌టిఆర్ కాలనీలో పర్యటించారు. సీసీ రోడ్లు, వీధిలైట్లు, తదితర సమస్యలను గుర్తించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. కమిషనర్ వెంట సిపిఎం నాయకులు హరి, బాబావలి, టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు దాదు, త్రివేంద్ర, షౌకత్, బోయ నంజుండ, చంద్ర, నారాయణనాయక్, యంగ్ ఇండియా వెంకటేశులు, నర్సింహులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



ఆసుపత్రి కమిటీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తదితరులు

మడకశిర : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే ఎంఎస్.రాజుని శుక్రవారం పలువురు అభినందించారు. ఆసుపత్రిలో నిర్వహించిన కమిటీ సమావేశం లో నూతన కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణమూర్తి, మారుతిరెడ్డి, మంజునాథ్, అశ్వత్థరామప్పలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, ఆసుపత్రి సూపరింటెండెంట్ శశిరేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు చెక్కు అందజేత

పుట్టపర్తి రూరల్ : విజయవాడ వరద, ముంపు బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వడ్డే సిమెంట్ పోలన్న, సత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు జరిపిటి కృష్ణమూర్తి శుక్రవారం సిఎం సహాయ నిధికి రూ. 2.16 లక్షల విరాళం చెక్కును విజయవాడలో సిఎం చంద్రబాబుకు అందజేశారు. కష్టాల్లో ఉన్న వారికి సాయమందించిన వారిని చంద్రబాబు అభినందించారు. జరిపిటి కృష్ణమూర్తి, వడ్డే పోలన్న మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా ప్రజల తరపున ఈ ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. వారితో పాటు జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు వడ్డే పుల్లన్న, తదితరులు ఉన్నారు.

ఆర్‌టిఓగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



కదిరి టౌన్ : కదిరి ఆర్‌టిఒగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం డిటిసి ఆఫీస్‌లో పరిపాలన అధికారిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. రవాణా శాఖలో 1993 మే నెలలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి 2003 మే నెలలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. రాయలసీమలో పలు చోట్ల విధులు నిర్వర్తించారు. నూతన ఆర్‌టిఒకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మడకశిర అర్బన్ సిఐగా రామారావు



ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు పూలబొకే ఇస్తున్న సిఐ రామారావు

మడకశిర : పట్టణ సిఐగా రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయన ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. నూతన సిఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడతామని తెలిపారు.

పుట్టపర్తిలో ప్లాస్టిక్ నిషేధం : కమిషనర్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో ప్లాస్టిక్ వాడకం నిషేధమని, ఎవరైనా అతిక్రమించి వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద హెచ్చరించా రు. ఆయన శుక్రవారం పట్టణంలో నిర్వహి స్తున్న పలు హోటళ్లను తనిఖీ చేశారు. మెయిన్ బజార్‌లో ఇడ్లీ తయారీలో కుక్కర్‌లో ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు గుర్తించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమా దం ఉందని, బదులుగా పలచటి వస్త్రం వాడాలని హోటల్ యజమానికి సూచించా రు. అనంతరం దుకాణాల వద్దకు వెళ్లి వ్యర్థాలు రోడ్లపై వేయకూడదని, మున్సిపల్ అధికారులు ఇచ్చిన చెత్త బుట్టల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయా లన్నారు. హోటల్ నిర్వాహకులు, దుకాణ దారులు రోడ్లపై ఇష్టానుసారంగా వ్యర్థాలు వేస్తే చర్యలు ఉంటాయని తెలిపారు.

బ్యూటీపార్లర్‌ను రద్దు చేయాలి

మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటకనాగేపల్లి వద్ద కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న బ్యూటీ పార్లర్‌ను వెంటనే మూసి వేయించాలని పుట్టపర్తి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రహ్లాద, ఛైర్మన్ ఓబుళపతిలకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుల వృత్తిని ఆధారంగా చేసుకొని పట్టణంలో 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. తమ జీవనోపాధికి దెబ్బకొట్టేలా కార్పొరేట్ స్థాయిలో బ్యూటీ పార్లర్ పెట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మీసాల శ్రీనివాసులు, గోపి, నాగరాజు, రమణ, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, మల్లి, పాల్గొన్నారు.




హోటల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రహ్లాద

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నల్లచెరువు

ఎస్‌జిఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల, బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిం చారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి డిఇఒ యు.మీనాక్షి, ఎంఇఒ తిరుపాల్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్, చెస్, యోగా, తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిం చారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయిలో పోటీ పడతారని మండల ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీల కోఆర్డినేటర్ వాదలపల్లి షఫీ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు శ్రీనాథ్‌రెడ్డి, గౌస్‌పీర్, పీడీలు సంధ్య, సుజాత, హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన అండర్-14, అండర్-17 పోటీల్లో స్థానిక పివిఎస్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బాలుర విభాగంలో అండర్-17 హైజంప్‌లో ఫస్ట్, చెస్‌లో విన్నర్స్, కబడ్డీలో రన్నర్స్, అండర్-14 లాంగ్ జంప్‌లో సెకండ్ ప్లేస్. బాలిక విభాగంలో అండర్-17 ఖోఖోలో విన్నర్స్‌గా నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ ఛైర్మన్ నాయుడు, పిఇటి జ్యోతి యాదవ్, ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారి

బత్తలపల్లి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని మండల కోఆర్డినేటర్ టి.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని రామాపురం జడ్పీ హైస్కూల్ మైదానంలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సోషియల్ ఉపాధ్యాయులు గంగిరెడ్డి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, మహమ్మద్‌జాన్, రవీంద్ర, నాగమల్లేసు, పిఇటిలు సువర్ణ, లాల్‌బాషా, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో బంగారు పతకాలు

ధర్మవరంరూరల్ : చెన్నైలో ఈ నెల 10వ తేదీ నుంచి జరుగుతున్న 'ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్ సబ్ జూనియర్ జూడో లీగ్' పోటీల్లో మండలంలోని చిగిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. 9వ తరగతి విద్యార్థినులు నందిని 32 కిలోల విభాగంలో, లాస్యరెడ్డి 44 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు పిఇటి ప్రతాప్ రెడ్డి, హెచ్‌ఎం తిప్పారెడ్డి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగుబ్బ : మండలంలోని కుటాగుళ్ల 132/33 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

కదిరి టౌన్ : కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో శుక్రవారం హిందీ భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14వ తేదీ హిందీ భాషను జాతీయ భాషగా ప్రకటించారని తెలిపారు. కబీర్‌దాస్, తులసీదాస్, మీరాబాయి, ప్రేమ్‌చంద్ లాంటి గొప్ప కవులు హిందీ భాషలో రచనలు, పద్యాలు రచించి ప్రపంచానికి మంచి సందేశం ఇచ్చారన్నారు. ప్రతి విద్యార్థి హిందీ భాషపై పట్టు సాధించాలని, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రల్లో మాతృభాషతో పాటు హిందీ మాట్లాడుతారన్నారు. అంతకు ముందు హిందీ కవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, గీతాలు ఆకట్టుకున్నాయి.

వైసిపి శ్రేణులకు అండగా ఉంటాం

రొద్దం : ప్రతి వైసిపి కార్యకర్తకు అందుబాటులో ఉంటామని మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి మండలంలోని ఆర్.మరవపల్లి లో వైసిపి రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి ఇంట్లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని 2029లో సిఎం చేయడానికి ప్రతిఒక్కరూ ఇప్పటి నుంచే గ్రామస్థాయి నుంచి సైనికుల్లా పని చేయాలని సూచించారు. అలాగే మండల సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తిమ్మయ్య, బి.నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మారుతిరెడ్డి, రాజారెడ్డి, సర్పంచులు రూపా, సోమిరెడ్డి, శివరాజ్, పరమేష్, రామచంద్రరెడ్డి, ఎంపీటీసీ బాలాజీ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సికె పల్లిలో వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి : కొన్ని రోజులుగా కనిపించకుండాపోయిన ఓ వ్యక్తి గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. స్థానిక ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న హరిజన కర్రెప్పగారి నరసింహులు అల్పాహారం(టిఫిన్) తెచ్చుకోవడానికి ఈ నెల 9వ తేదీ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో ఓ చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకున్నట్లు గొర్రెల కాపరులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు వచ్చి నరసింహులుగా గుర్తించారు. అతడికి భార్య నారాయణమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరికీ వివాహమైంది. ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిసిలో హమాలీ..

ఓబుళదేవరచెరువు : స్థానిక చెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్న అరిగే శ్రీనివాసులు(46) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరిగే శ్రీనివాసులు వృత్తి రీత్యా హమాలీ. అతని భార్య శివమ్మ రెండు రోజుల క్రితం బెంగళూరులో ఉన్న పెద్ద కుమార్తెను చూడడానికి వెళ్లింది. ఇంటి వద్ద చిన్న కుమార్తె, శ్రీనివాసులు ఉంటున్నారు. మధ్యాహ్నం చిన్న కుమార్తె పాఠశాలకు వెళ్లిన సమయంలో శ్రీనివాసులు ఇంటి దూలానికి ఉరి వేసుకున్నాడు. ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడు మృతి

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై శుక్రవారం మండలంలోని నల్లబోయనపల్లి బస్టాప్ వద్ద ట్రాక్టర్ ఢీ కొనడంతో ద్విచక్రవాహన దారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నగరంలోని ఐదో రోడ్డులో ఎంపీ కాలనీకి చెందిన గుగ్గిల్ల ఆంజనేయులు కుమారులు పవన్(27), ఈశ్వర్ వ్యాపారం కోసం ద్విచక్రవాహనంపై కదిరికి చీరలు తీసుకెళ్తున్నారు. నల్లబోయన పల్లి వద్దకు రాగానే గ్రామంలో నుంచి ట్రాక్టర్ జాతీయ రహదారిపైకి వచ్చింది. ఇది గమనించకుండా వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక వైపున బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో పవన్ అక్కడికక్కడే మతి చెందగా, ఈశ్వర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఈశ్వర్‌ను ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. పవన్ మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పవన్‌కు భార్య స్వాతి, కుమార్తె పునర్వి ఉన్నారు.

టిప్పర్లు, ట్రాక్టర్లు, జెసిబి పట్టివేత

బత్తలపల్లి : మండలంలోని చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న సిఐ ప్రభాకర్ తమ సిబ్బందితో మెరుపుదాడులు చేసి జెసిబితో పాటు మూడు ట్రాక్టర్లు, నాలుగు టిప్పర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఇసుక రీచ్, స్టాక్ పాయింట్ల వద్ద మాత్రమే ఇసుక తీసుకువెళ్లాలన్నారు. తనిఖీ చేసినప్పుడు రశీదు చూపాలని, లేనిచో కేసులు నమోదు చేస్తామన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

లేపాక్షి : మండలంలోని బిసలమనేపల్లి గ్రామంలో మధుసూదన్ తన ఇంటి ముందు ఉంచిన బుల్లెట్ వాహనానికి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బైక్ విలువ రూ. 2 లక్షలు ఉంటుంది. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా, ఎవరైనా నిప్పు పెట్టారా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది.

అనారోగ్యంతో వార్డు మెంబర్ మృతి

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ పంచాయతీ వార్డు మెంబర్, టిడిపి నాయకులు సాలక్కగారి రమేష్‌బాబు (54) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రమేష్‌బాబు మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురవడంతో అనంతపురంలో ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే సర్పంచి రాధానాగరాజు, మాజీ సర్పంచులు వెంకటరమణప్ప, హరినాథ్‌చౌదరి, మాజీ ఎంపీపీ వాణి శ్రీనివాస్, వార్డు మెంబర్లు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

9వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె

హిందూపురం : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు పట్టణంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాల యం ముందు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 9వ రోజుకు చేరింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు సమ్మెకు మద్దతు ఇచ్చి మాట్లాడారు. కార్మికుల కష్టాలను గుర్తించి వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాము, శ్రీ రామి రెడ్డి తాగు నీటి పథకం నాయకులు సోము, నాగేంద్ర, జబివుల్లా, రవి, గిరీష్, హనుమంతు, జగదీష్, మంజు, మల్లికార్జున, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు

గోనిపేటలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని వినతి

పెనుకొండ టౌన్ : మండలంలోని గోనిపేట గ్రామంలో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి హరి ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఏవో గిరికి వినతి పత్రం సమర్పించారు. హరి మాట్లాడుతూ గోనిపేట గ్రామ జనాభా దాదాపు 2 వేలు కాగా 1030 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రాథమిక పాఠశాల, రెండు అంగన్వాడీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రం, సచివాలయం, హెల్త్ సెంటర్ ఉన్నాయన్నారు. అయితే ఆ గ్రామం కొండల మధ్యన ఉండడంతో సిగ్నల్ సరిగా రాక ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విధి లేని పరిస్థితిలో ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లి ఫోన్ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి సెల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఆటో వెంకటేష్, ఆది, కె.వెంకటేష్, అశ్వర్థ, నాగరాజు పాల్గొన్నారు.

రిషిత హాస్పిటల్‌లో న్యూరో సేవలు

కదిరి టౌన్ : పట్టణంలోని రిషిత హాస్పిటల్‌లో ప్రతి నెలా 2, 4వ శనివారం బెంగళూరు నగరంలోని సాగర్ హాస్పిటల్ వైద్య బృందం న్యూరో సంబంధిత వ్యాధులకు వైద్య సేవలు అందిస్తారని చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ మదన్ కుమార్ తెలిపారు. వివరాలకు రిషిత చిన్నపిల్లల హాస్పిటల్, 95503 15503లో సంప్రదించాలన్నారు.